క్లుప్తంగా

నేడు సమావేశం

తాండూరు రూరల్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది దినోత్సవాల సందర్భంగా సోమవారం సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనితగౌడ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

విజయవంతం చేయాలి

దోమ: ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా.. నిర్వహించే సమావేశానికి సర్పంచులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ అనసూయ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళామోర్చా జిల్లా జట్టుకు అభినందనలు



శ్రీలతను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు తదితరులు

అనంతగిరి: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తెలంగాణలో కమలమిత్ర (కేంద్ర పథకాలపై అవేర్నెస్ కల్పించడంపై) ఉత్తమంగా నిలిచిన మహిళా మోర్చా జిల్లా జట్టును రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి అభినందించారని జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలతా తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఎంతో ఉందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో తాండూర్ అసెంబ్లీ కన్వీనర్ రేణుక, జిల్లా పాలసీ కన్వీనర్ శృతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: మండలంలోని ఎన్కేపల్లిలో గ్రామస్తులు గ్రామ దేవతలకు పూజలు, బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు సున్నపు వసంతం, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు



కమిటీ సభ్యులకు విరాళం ఇస్తున్న దాతలు

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా విరాళాలు అందజేశారు. కమిటీ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని మాసానిగూడ మాజీ సర్పంచ్ సంజి సతయ్య రూ. 2లక్షల 11వేలు, గోపులారం గ్రామ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ రూ. 1లక్ష, 11వేలు అందజేశారు. బుల్కాపురం గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి రూ. 52వేలు, శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి చెందిన రాజశేఖర్ 2కిలోల, 2మాసాల వెండి అందజేశారు. రవి కుమార్ రెండు తులాల, రెండు మాసాల బంగారం, కిలో వెండి విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆత్మలింగం, సభ్యులు శ్రీనివాస్, మోహన్, ప్రవీణ్, జంగయ్య, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, శేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

శంకర్‌పల్లి: మండలంలోని అయ్యప్ప దేవస్థానంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం నుంచి జూన్ 5వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం దేవాలయంలో గణపతి పూజతో ప్రారంభించామని, సోమవారం ఉదయం 7గంటలకు శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి అయ్యప్ప దేవస్థానం వరకు దేవతా మూర్తుల విగ్రహ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాసేవకు ముందుంటా..

శంకర్‌పల్లి: ప్రజాసేవ చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎంపీటీసీ బొల్లారం ప్రవళిక చెప్పారు. ఆదివారం ఆమె సొంత డబ్బులతో గ్రామస్తుల ప్రయాణ సౌకర్యార్థం ఉచిత ఆటో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రొద్దటూరు గ్రామం నుంచి ప్రొద్దటూరు స్టేజి వరకు ఉచిత ఆటో సేవలు కల్పించడం జరిగిందన్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు స్టేజీ వరకు వెళ్లి బస్సు ఎక్కేందుకు ఎంతో సులువుగా ఉంటుందన్నారు. గతంలో తమ కుటుంబ సభ్యులు సర్పంచ్‌గా ఉన్న సమయంలో సొంత డబ్బులతో తాగునీటి ట్యాంకర్, సీసీరోడ్ల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.

ధాన్యం రైతుల దైన్యం

చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు అపసోపాలు పడుతున్నారు. ఓ వైపు వర్షం భయం, మరో వైపు లారీల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను విక్రయించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. పట్టించుకునే వారు కరువై.. కడకు పంటకు నిప్పుపెట్టి కన్నీటి పర్యంతం అవుతున్నారు.

- అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్న అన్నదాతలు
- లారీల కొరతతో కేంద్రాల్లో పేరుకుపోతున్న నిల్వలు
- ధాన్యం తీసుకోని మిల్లర్లు.. చోద్యం చూస్తున్న అధికారులు
- వేధిస్తున్న గన్నీబ్యాగుల కొరత.. ఆందోళనలో కర్షకులు



దోమ కొనుగోలు కేంద్రంలో ధాన్యంతో ట్రాక్టర్లు



దిర్సంపల్లిలో ధాన్యం బస్తాకు నిప్పంటించి నిరసన తెలుపుతున్న రైతులు

దోమ: ఎన్నో ఆశలతో చేతికొచ్చిన పంటను అమ్మి సొమ్ముచేసుకుందామని, ఆపై అప్పు తీర్చుకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రాగా.. అధికారుల అలసత్వం, నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా కర్షకులు నీరసించిపోతున్నారు. రేయింబవళ్లు కేంద్రాల వద్ద దిగుబడికి కాపలా కాస్తూ దిగాలు చెందుతున్నారు. మండలంలో పది రైస్ మిల్లులు అధికారులు కేటాయించినప్పటికీ కేవలం మోత్కూర్ గేట్ సమీపంలోని మహాలక్ష్మి రైస్‌మిల్ మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తోంది. దీంతో రైతులు సెంటర్ల వద్దకు తీసుకువచ్చిన ధాన్యం కేంద్రాల్లోనే మగ్గుతోంది. చేసేది లేక ట్రాక్టర్లపై తీసుకువచ్చిన ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పి సెంటర్ల వద్దే రైతులు పడిగాపులు కాస్తున్నారు. విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ లారీలు వస్తాయని మభ్యపెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దిర్సంపల్లి గ్రామంలో శనివారం రైతులు రోడ్డెక్కి ధాన్యం కొనాలంటూ బస్తాలకు నిప్పటించి నిరసన తెలిపారు.

మిల్లర్ల నిర్లక్ష్యం

మండలంలో 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొమ్మిది, డీసీఎమ్మెఎస్ ఆధ్వర్యంలో నాలుగు, ఐకేపీ ఆధ్వర్యంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేయగా, వాటికి పది మిల్లులను కేటాయించారు. కానీ మోత్కూర్ రైస్‌మిల్లు.. మాత్రమే బొంపల్లి, దోమ, మోత్కూర్, ఐనాపూర్, ఖమ్మం నాచారం సెంటర్ల నుంచి వచ్చే ధాన్యాన్ని మాత్రమే తీసుకుంటుంది. కాని.. రవాణా ఖర్చులు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. మిగతా మిల్లర్లు ఆయా సెంటర్లలో నిల్వ ఉన్న ధాన్యాన్ని తీసుకోవడం లేదని, రోజుల తరబడి కేంద్రాల వద్దే దిగుబడితో నిరీక్షిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు సెంటర్లలో గన్నీబ్యాగులు లేవని రైతులు వాపోతున్నారు.

తాలు, తరుగు పెరుతో దోపిడీ

ధాన్య కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు తాలు, తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మోత్కూర్ రైస్‌మిల్లులో తాలు, తరుగు పేరుతో క్వింటాకు నాలుగు నుంచి ఐదు కిలోలు తీసేస్తున్నారని రైతులు చెబుతున్నారు. హమాలి పని తమతోనే చేయిస్తూ క్వింటాల్‌కు రూ.35 తమ వద్దే వసూలు చేస్తున్నారని, అధికారులకు విషయం చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇదే అంశంపై తహసీల్దార్ షాహెదా బేగంను సాక్షి సంప్రదించగా.. కలెక్టర్ సమావేశంలో ఉన్నానని, డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడాలని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

“ లారీల కొరత ఏర్పడింది



కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. మూడునాలుగు రోజులుగా దిగుబడిని సెంటర్ వద్దే ఉంచి నిరీక్షిస్తున్నాను. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. లారీల కొరత తీర్చాలని కోరుతున్నాం.

– రమేశ్, రైతు, ఐనాపూర్

రవాణా ఖర్చులు ఇవ్వడం లేదు



రైతుల ధాన్యాన్ని ట్రాక్టర్ ద్వారా మిల్లులకు చేరవేస్తున్నాం. కానీ మిల్లర్లు తమకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో రైతు వద్ద నుంచే తీసుకుంటున్నాం. సంబంధిత అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రవాణా ఖర్చులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– నవీన్, ట్రాక్టర్ ఓనర్, దోమ

తాలు, తరుగు పేరుతో దోపిడీ



దిగుబడిని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే నిర్వాహకులు తాలు, తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారు. ఒక క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదు కిలోలు కట్ చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– వెంకటయ్య, రైతు, దోమ

‘మోదీ నాయకత్వం కోరుకుంటున్న యువత’

కుల్కచర్ల: దేశ యువత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించి మాట్లాడారు. దేశానికి విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చిన వ్యక్తిగా మోదీని కొనియాడుతూ.. ఆయన నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కుటుంబ పాలనలకు అంతం పలకడం, అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మైపాల్, మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, మండల కార్యదర్శి శివసంతోష్, కోశాధికారి కొండ ఆంజనేయులు, నాయకులు భీమయ్య, మల్లేశ్, నరేష్, వెంకటేశ్, శ్రీకాంతరావు, చంద్రకాంత్, బూరకొండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కేసులు

పెద్దేముల్: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు వి క్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి నజీరొద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువులు మండలానికి ఇంకా రాలేదని, వారం రోజుల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. రైతులు విత్తనాలు, ఎరువులు ఖరీదు చేస్తే.. తప్పకుండా రశీదు తీసుకోవాలని సూచించారు. రైతుల తంబు లేకుండా విక్రయాలు జరిపితే వ్యాపారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా సురవరం జయంతి



సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు

తాండూరు టౌన్: తెలంగాణ వైతాళికుడు, కవి సురవరం ప్రతాప రెడ్డి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అనంత సాహిత్య వేదిక తాండూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక సాయిపూర్ శివాలయంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు కవులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వడిచర్ల సత్యం, కోటం చంద్రశేఖర్, కాగ్నా కళా సమితి ఉపాధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ మాట్లాడారు. నిజాం పాలనలో కొనసాగిన దౌర్జన్యాలు, అరాచకాలపై తన గోల్కొండ పత్రిలో అనేక వ్యాసాలు, కథలు రాసి ప్రజల్లో చైతన్యం కలిగించారని గుర్తుచేశారు. ఆయన పోరాటం, జీవన విధానం నేటి తరానికి ఆదర్శనీయమని చెప్పారు. అనంతరం పలువురు కవులు ఆయన జీవిత విశేషాలపై, పాటలు, పద్యాలు, మణిపూసలు, వచన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో యువకవులు గాజుల పవన్‌కుమార్, వెంకట్ ధర్మచక్ర, అంజి చైతన్య, హాజీపూర్ శ్రీనివాస్, ప్రతిభా భారతి, మోహన్ పూదోట తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

షాబాద్ సీఐ గురువయ్యగౌడ్

షాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాల ప్రాంగణంలో వీర సావర్కర్ జయంతి సందర్భంగా గాంధీ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తదాన శిబిరాలు ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయడానికి ఉపయోగపడతాయన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ రక్తం పోవడం వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ పాండు, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అశోక్, రఘు, విజయ్, నరేష్, కృష్ణ, కుమార్ చెన్నారెడ్డి తదితరులున్నారు.

పార్టీ బీమా.. కార్యకర్తలకు ధీమా



ధారూరు: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: పార్టీకి సేవ చేసిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత తమకు ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త రాంపూర్‌తండాకు చెందిన కెతావత్ ఉమ్లీబాయి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. దీంతో పార్టీ నుంచి ప్రమాద బీమా రూ.2 లక్షలు మంజూరు కాగా.. ఆ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే ఆనంద్.. కార్యకర్త కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. పార్టీ కల్పించిన బీమా సౌకర్యం.. ఆ కుటుంబానికి ధీమా కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, పార్టీ నాయకులు సంతోష్‌కుమార్, అంజయ్య, రాములు, రవినాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేపట్టాలి

అనంతగిరి: జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు వారాలు జరిగే ఉత్సవాలలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయంవంతం చేయాలన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

ధారూరు: కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాంపూర్‌తండాకు చెందిన కాంగ్రెస్ నేత ఠాకూర్ కూడా పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

‘ప్రజాగర్జన’ సభను జయప్రదం చేద్దాం

కొందుర్గు: కొత్తగూడెంలో జూన్ 4వ తేదీన నిర్వహించే సీపీఐ ప్రజా గర్జన ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య అన్నారు. కొందుర్గులో ఆదివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించామని, గ్రామాల్లో జీపుయాత్ర తదితర కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సీపీఐ ప్రజాగర్జన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సభకు అన్ని గ్రామాల నుంచి కర్షక, కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహోన్నత వ్యక్తి పండుగ సాయన్న



విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

కుల్కచర్ల: బహుజన ప్రజలకు స్ఫూర్తిదాయక వ్యక్తిగా పండుగ సాయన్న చరిత్రలో నిలిచిపోయారని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం అన్నారు. ఆదివారం ఇప్పాయిపల్లిలో సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని, పెద్దలను, దొరలను ఎదిరించి పేద ప్రజలకు ఉన్నతికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి సాయన్న అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు ఆంజనేయులు, ఇప్పాయిపల్లి గ్రామ అధ్యక్షుడు రాములు, నాయకులు మైపాల్, కర్ణయ్య, ఆనంద్, హన్మయ్య, వెంకటయ్య, చంద్రయ్య, ఆంజనేయులు, బాలయ్య, రాములు, నవీన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయన్న జీవితచరిత్రను భవిష్యత్ తరాలకు అందిద్దాం

కుల్కచర్ల: పండుగ సాయన్న జీవితచరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషిచేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్నెలింగం ముదిరాజ్ అన్నారు. ఆదివారం కుస్మసముద్రం గ్రామంలో పండుగ సాయన్న నివాసం, పూజించిన అమ్మవారు పోచమ్మ దరి ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. సాయన్న జీవిత చరిత్రను డాక్యుమెంటరీ తీస్తామని చెప్పారు. కార్యక్రమంలో బోయిని శ్రీనివాస్, గోపాల్, రఘువీరారెడ్డి, మిట్టుబాయ్, నర్సింహులు, గోపాల్ చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ పారవశ్యం

- జిల్లాలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న బాల్య మిత్రులు

గడిచిన కాలం ఎంతో మధురం. బాల్యం ముచ్చట్లు, చిలిపి చేష్టలు, ఆడీపాడిన ఆనంద మధుర క్షణాలు ఇలా అన్నీ తలుచుకుంటూ.. నాటి స్మృతుల జడివానలో పూర్వ విద్యార్థులంతా తడిసి ముద్దయ్యారు. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినా.. రెండు దశాబ్దాల అనంతరం వారంతా ఏకమై.. అ సమ్మేళనం జరుపుకొన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి.. వారి అనుభవాలను పంచుకున్నారు.



దౌల్తాబాద్: ఉపాధ్యాయులు, విద్యార్థులు



పరిగిలో..



పూడూరులో..

తాండూరు రూరల్: తాండూరు మండలం మల్కాపూర్ ఉన్నత పాఠశాలలో 2003–2004 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా సకుటుంబ సమేతంగా సందడి చేశారు. విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు నాటి తీపి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలు గుర్తుచేసుకుంటూ సంబురంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు సుభాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు దివాకర్‌రెడ్డి, మల్లేశం, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దస్తప్ప, విఠల్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్‌చాల్ ఉన్నత పాఠశాల..

మోమిన్‌పేట: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వెల్‌చాల్‌లో ఘనంగా జరిగింది. మండల పరిధిలోని వెల్‌చాల్ ఉన్నత పాఠశాలలో 2003–04లో 10వ తరగతి చదివిన విద్యార్థులు.. చదువు చెప్పిన ఉపాధ్యాయులతో నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: 2001–02 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ఫంక్షన్ హాలులో ఆదివారం సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అపూర్వ సంబురం జరుపుకొన్నారు. బాల్య స్నేహితులు.. వారి కుటుంబాలు, పిల్లల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి ఉపాధ్యాయులతో తమ అనుభవాలు పంచుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు.

కంకల్ పాఠశాలలో..

పూడూరు: కంకల్ పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల వేదికగా సంబురం జరుపుకొన్నారు. ఇరవై ఏళ్ల తరువాత ఏకమైన బాల్య మిత్రులంతా నాటి చిలిపి చేష్టలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులతో వారి అనుభవాలను పంచుకొన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణారెడ్డి, లక్ష్మణ్, వీరన్న, మధుసూదన్, ప్రదీప్‌రావు, బ్రహ్మచారి, బుచ్చిబాబు, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో..

పరిగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1996–98 ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణ కేంద్రంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా రెండు దశాబ్దాల తరువాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ముర్గేషన్, కోటేశ్వరరావు, పండరినాథ్, ప్రతాప్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు



మోమిన్‌పేట: ఉన్నత పాఠశాలలో..

ఇదేనా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్?

ఎక్కడి చెత్త అక్కడే..



మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త

పెద్దేముల్: వారం రోజులుగా ప్రభుత్వం గ్రామాల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నన్న చందంగా.. సమస్యలు అలాగే ఉన్నాయని, సంబంధిత అధికారులు తనిఖీలు అంతంత మాత్రమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా నాలుగు రోజు క్రితం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్‌లు తట్టెపల్లి, మంబాపూర్, జైరాంతండా, ఓంలానాయక్‌తండాలతో పాటు పలు గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉండాలని, రోడ్ల పక్కన పెంట కుప్పలు ఉండరాదని ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుష్మాలు పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. ఏం లాభం లేదని వాపోతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ప్రజలు ఎలాంటి రోగాల భారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను తొలగించి, మురుగు గుంతలు ఉన్న చోట మట్టితో వాటిని పూడ్చాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ మండల అధికారులకు అవేమీ పట్టడం లేదు. తట్టెపల్లి గ్రామంలో డ్రైనేజీ కాల్వలు లేక చర్చి పరిసర ప్రాంతంలో మురుగు నీరు చేరి దోమలకు నిలయంగా మారింది. సిద్దన్న మడుగుతండా, ఉరేంటితండా, అడ్కిచెర్ల, ఇందూరు, కందనెల్లి తండాల్లో మురుగు జలాలు రోడ్లపై పారుతున్నాయి. ఇప్పటి కైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాల్వలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ‘సాక్షి’ ఎంపీఓ షేక్‌సుష్మాను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు.